## పొరపాటు

ఒకనాడు ఒక భార్యా భర్తల జంట బజారుకు వెళ్ళారు. వాళ్ళు అటూ ఇటూ ఉన్న కొట్లు చూస్తూవెళ్తున్నారు. భర్త పరధ్యానంగా ఏదో ఆలోచించుకుంటూ తలవంచుకొని నడుస్తున్నాడు. ఇంతలో భార్య ఒకషాపులో ఒక వింత వస్తువును చూచి ఆశ్చర్యంగా "మీకేదీ చూడాలని వుండదు. కనీసం నే నెలా వున్నది కూడా చూడరు. వారంరోజుల నుండి నాతో మాట్లాడటంకూడా లేదు" అని అన్నది. అంతలో ఆ మనిషి వెనక్కు తిరిగి "క్షమించండి! అది నా దురదృష్టం. ఐనా అది నా తప్పు గాదు" అని అన్నాడు. ఆమె ఆశ్చర్యాని కంతులేదు.

కారణం: ఈయన పూర్తిగా క్రొత్త మనిషి. ఆమె భర్త కాస్తదూరంలో తల వంచుకొని నడుస్తున్నాడు.

కొండముడి దత్తాత్రేయులు

* * *

## "పెళ్ళిచూపులు"

మా సూర్యం పెళ్లికోసం వాడిబాష్మ తొందరపడ్డకొద్ది వెనక్కు వెడుతోంది పెళ్ళి. అసలు ఈ అలస్యానికి కారణం వాడే. వాడికి, పిల్ల అందంగా వుండాలి. సంగీతం వచ్చిందై యుండాలి, కట్నం బాగా ఇచ్చేవాళ్లయి వుండాలి. అన్నిటి కంటె వాడికి సంగీతంపై మోజెక్కువ. దానివల్లనే కొన్ని సంబంధాలు పెళ్ళి చూపుల్లోటే ఆగిపోయింది. ఒక పిల్లను చూడటానికి వెళ్ళినప్పుడు పాటపాడమంటే "తొలినేజేసిన పూజా ఫలమో" అంటూ పాడింది. అది విని మా వాడు "నన్ను చూడగానే నాలో ఏదో లోపం కనిపెట్టినట్లు ఇలా పాడుతోంది. పెళ్లయిన తరువాత కూడ రోజూ ఇలానే దెప్పుతుందేమో" అని లోపల అనుకొని కట్నంవిషయం మాట్లాడకుండానే తిరుగుముఖం పట్టాడు. ఇంకొక అమ్మాయిని చూడడానికి వెళ్లినప్పుడు "ఏదిరా నా సీత! సోదర! లక్ష్మణ" అంటూ ఆరున్నొక్క రాగంతో పాడడం మొదలెట్టింది. 'ఇదేమిటి ఇప్పుడే శోకాలు మొదలెడుతోంది' అని ఆ సంబంధాని క్కూడా తిలోదకాలిచ్చాడు మావాడు. మరొకకన్య "ఏలనయ్యా కట్నములు? ఎందుకయ్యా కట్నములు?" అంటూ అధికారస్వరంతో ఆలాపన తీయడం మొదలెట్టింది. ఇంక మావాడి పని చూసుకోండి! అసలే కట్నం కావాలాయెను. ఆ అమ్మాయి అలా పాడుతుంటే కట్నం ఏమడుగుతాడు. అందుచే ఆ సంబంధంకూడ పైవాటికి డిటో అయింది. అప్పటినుండి మా వాడికి సంగీతంపై కొంత మోజు తగ్గిందనే చెప్పవచ్చు. ఆ తరువాత వాడు మళ్ళీ ఎవర్ని చూచుకుందుకు వెళ్ళినా పాట పాడమని అడగలేదు. శ్రీరామమూర్తి

* * *

## కోతి మాస్టారు

లెక్కలుమాస్టరు కోగంటి తిమ్మయ్యశాస్త్రి అంటే హైస్కూలు పిల్లలందరికి హడల్. ఫస్టుఫారంనుండి స్కూలు ఫైనలువరకు లెక్కలు ధారాళంగా చెప్పగల సమర్థత గలవాడు. ఇచ్చే అరవై రూపాయల జీతం చాలక, ప్రయివేటుగా నాల్గు డబ్బులు సంపాదించుకునే నిమిత్తం మావూరి షావుకారు ముత్యాలుశెట్టి కుమారుడు వరహాల్ని ప్రయివేటు చెప్పడానికి ఏర్పాటు చేసుకున్నాడు. పెద్ద షావుకారు బిడ్డయినా వరహాలు మాష్టారింటికే వెళ్ళి చదువుకునేవాడు. ఓనాడు ప్రయివేటు చదువుతూ వడ్లగోతాలమీద కో॥ తి॥ (అంటే కోగంటి తిమ్మయ్యశాస్త్రి అన్న మాట) అనే పొడిఅక్షరాలు చూచాడు. మాష్టారు పేరు ఇదేనని ఊహించాడు తెలివి తక్కువ వరహాలు. శాస్త్రిగారు హైస్కూలుకు కొత్తగా రావడంవల్ల ఆయనపేరు చాలామందికి తెలియదు. తిమ్మయ్యశాస్త్రిగారు ఓరోజున బడికి అలస్యంగా రావడం జరిగింది. ఇంతలో క్లాసంతా గగ్గోలుపెట్టుచుండగా హెడ్ మాస్టరుగారు వచ్చి, ఎందుకు గోలచేస్తున్నారు, ఈ పీరియడు ఎవరు రావాలి మీకు అని గర్జించారు. వెంటనే వరహాలు లేచి కోతిమాస్టారండీ అన్నాడు. హెడ్మాష్టరుకు పట్టలేనంత కోపంవచ్చి దగ్గిరున్న బెత్తంతో కొట్టబోగా వడ్లగోతాలవిషయం చెప్పాడు వరహాలు. హెడ్మాష్టరు, కోతి అంటే కోగంటి తిమ్మయ్యశాస్త్రి అని గ్రహించి వేంటనే సర్దుకున్నాడు. క్లాసుపిల్లలంతా తమలో తాము నవ్వుకున్నారు.

మండల కేశవరామమూర్తి

* * *

## చెవిటి మాలోకము

మా ఊళ్ళో సరస్వతీస్వాముల వారు గీతోపన్యాసాలు ఇచ్చినరోజులవి. స్వాములవారి ఉపన్యాసాలు వినడానికి చాలమంది గీతామందిరానికి వెళ్ళేవారు. ఒక రిటైరైన సబ్ రిజిస్ట్రారు, మాస్కూలు పండితులు కూడ తరుచు వెళ్లేవారు. వీళ్లిద్దరికి బ్రహ్మాండమైన చెవుడు. వీళ్లకి ఉపన్యాసాలు ఎలా వినిపించేవో తెలియదు.

అవేళ అదివారము నేను ఫుట్ బాల్ గ్రౌండ్‌కు వెల్తున్నా. దారిలో ఆ సబ్ రిజిస్ట్రారు, మా తెలుగుపండితులు ఒకరికొకరెదురై ఇలా పరామర్శించుకున్నారు.

తె॥ ప:—'ఎందాకా? గీతామందిరానికా ఏమిటి బయలుదేరారు?'

సబ్ రి:—'అబ్బే లేదండి! కొద్దిసేపు గీతా కాలక్షేపముచేసి వద్దామని.'

తె॥ ప:—'అలాగా! ఇంకా గీతా కాలక్షేపానికో ఏమో అనుకున్నాను.'

శ. కోటి